క్లుప్తంగా

పెద్దనాగలూటిలో వైద్యశిబిరం ఏర్పాటు



భక్తులను పరీక్షిస్తున్న వైద్యులు

ఆత్మకూరు: మండలంలోని పెద్దనాగలూటి గ్రామంలో గురువారం వైద్యశిబిరం ఏర్పాటు చేసినట్లు వైద్యాధికారులు గోపాల్, పవన్‌కుమార్ తెలిపారు. శివరాత్రి పండగ సందర్భంగా పాదయాత్రగా శ్రీశైలం వెళ్తున్న శివభక్తుల కోసం పెద్దనాగలూటి వద్ద 24 గంటల వైద్యశిబిరం ఏర్పాటు చేశామన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పెద్దనాగలూటిలో ఉన్న కోనేరును క్లోరినేషన్ ద్వారా తాగునీటిని శుభ్రపరిచినట్లు తెలిపారు. ఆరోగ్య సంబంధమైన ఏ సమస్యకైనా వైద్యశిబిరాలనువినియోగించుకోవాలని వైద్యాధికారులు కోరారు. వైద్య సిబ్బంది అహ్మద్‌బాషా, ప్రవీణ్, భాస్కర్, విశ్వనాథ్ పాల్గొన్నారు.

మల్లన్న భక్తులకు మజ్జిగ పంపిణీ

శ్రీశైలంప్రాజెక్ట్: మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలానికి కాలినడకన వచ్చే భక్తులకు భీమునికొలను, హఠకేశ్వరం తదితర ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు అల్పాహారం, మజ్జిగ పంపిణీ చేస్తున్నారు. గురువారం విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి కాశయ్య, టీడీపీ నాయకులు మైలా శ్రీనివాసులు భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు.

కంటి అద్దాల పంపిణీ



కంటి అద్దాలు పొందిన విద్యార్థులతో డాక్టర్ వేణు గోపాల్, ప్రిన్సిపాల్

బండిఆత్మకూరు: స్థానిక మోడల్ స్కూల్ విద్యార్థులకు ప్రిన్సిపాల్ అబ్దుర్ రఫీ ఆధ్వర్యంలో నంద్యాల గవర్నమెంట్ ఆసుపత్రి కంటి వైద్యుడు వేణు గోపాల్ గురువారం కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన కంటి పరీక్షా శిబిరంలో కొంతమంది విద్యార్థులకు కంటి దృష్టి సమస్యలున్నట్లు గుర్తించడంతో, వైద్యుల సిఫార్సు మేరకు కంటి అద్దాలను ఉచితంగా అందజేశామన్నారు.

ఘనంగా గంధోత్సవం

పాములపాడు: మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిన కంబాలపల్లి మస్తాన్‌వలి ఉరుసు గంధోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఉరుసు ఉత్సవాల్లో భాగంగా రాత్రి మేళతాళాల మధ్య గంధం పెట్టెను ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, కాయ, కర్పూరాలు సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు.

నేడు సామాజికి తనిఖీ బహిరంగ సభ

పాములపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఆవరణంలో శుక్రవారం సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఓ విమలమ్మ తెలిపారు. 2023 ఏప్రిల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులపై ఇప్పటికే గ్రామాల్లో సామాజిక తనిఖీలు జరిగాయన్నారు. వీటికి సంబంధించి చర్చా వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజాప్రతినిధులు, ఉపాధి సిబ్బంది, ప్రజలు హాజరుకావాలని తెలిపారు.

పీ-4 సర్వే వేగవంతం చేయండి

పాములపాడు: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా చేపట్టిన పీ–4 సర్వే వేగవంతం చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. గురువారం మండలంలోని మిట్టకందాల, పెంచికలపల్లి గ్రామాల్లో సచివాలయ సిబ్బంది చేస్తున్న సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీరో పావర్టీ, ఉద్యోగాల సృష్టి, నైపుణ్యత పెంపు, రైతు సాధికారత, తాగునీటి రక్షణ, వరల్డ్ క్లాస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, స్వచ్ఛ ఏపీ, మానవ వనరుల వినియోగం, శక్తి వనరుల నిర్వహణ, సాంకేతిక జ్ఞానం పెంపు తదితర 10 సూత్రాలపై సర్వే జరుగుతోందన్నారు. మార్చి 2లోగా సర్వే పూర్తి చేసి నివేదికలు ఉన్నతాధికారులకు అందజేయాలన్నారు. సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట సచివాలయ సిబ్బంది ఉన్నారు. మండలంలోని మద్దూరు గ్రామంలోని సచివాలయంలో ఆధార్ స్పెషల్ డ్రైవ్ క్యాంపును పరిశీలించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

పగిద్యాల: నెహ్రూనగర్‌లోని ముస్లిం కాలనీలో బొలేరో వాహనం విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఘటనలో కాలనీ వాసులకు త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన నాయుడు బుధవారం రాత్రి బొలేరో వాహనాన్ని రివర్స్ తీసుకునే క్రమంలో స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు ఇళ్లలోకి పరుగులు తీశారు. విద్యుత్ తీగలు తెగిపోవడంతో రాత్రంతా అంధకారంలో గడిపారు.

అన్నదాతా.. సుఖీభవా!

- శివస్వాములకు అడుగడుగునా అన్నదానాలు
- నల్లమలలోనే ఐదు చోట్ల, ఉమ్మడి జిల్లాల్లో పలు చోట్ల భక్తులకు అన్నదాన శిబిరాలు
- మల్లన్న సన్నిధికి పాదయాత్రగా వెళ్తున్న లక్షలాది మంది భక్తులు
- శివరాత్రి వరకు కొనసాగనున్న అన్నదాన శిబిరాలు

అన్నం పరబ్రహ్మ స్వరూపం. అన్నిదానాల కంటే అన్నదానం మిన్న. అన్నదానం చేస్తే సర్వ పాపాలు తొలగి పుణ్యం లభిస్తుందనేది పెద్దలు చెబుతున్న మాట. ఈ అన్నదానం తొలిసారిగా శ్రీశైలమహాక్షేత్రంలోనే ప్రారంభమైనట్లు కరివేన బ్రాహ్మణులు పేర్కొంటున్నారు. 400 ఏళ్ల క్రితం నుంచి అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెబుతారు. శ్రీశైలమహాక్షేత్రానికి ఎలాంటి రవాణా మార్గాలు లేని సమయాల్లోనే గాడిదల ద్వారా వంట సామగ్రిని శ్రీశైలానికి చేర్చి శివరాత్రి సమయంలో భక్తులకు బ్రాహ్మణులు ఉచితంగా భోజనం వడ్డించేవారని చెబుతారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు శ్రీశైల క్షేత్రంలో అన్నదానాలు కొనసాగుతూనే ఉన్నాయి. కాలినడకన మల్లన్న క్షేత్రానికి వెళ్తున్న భక్తులు కడుపు నిండా భోజనం చేసి దాతలను దీవిస్తూ ముందుకు సాగుతున్నారు.

– ఆత్మకూరు

తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ..

నాగలూటి వీరభద్రస్వామి క్షేత్రం వద్ద పెద్ద దేవులాపురం గ్రామానికి చెందిన శివభక్తుడు బాలవెంకటరెడ్డి 30 ఏళ్ల క్రితం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. బాలవెంకటరెడ్డి మరణించడంతో ఆయన కుమారుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నదాన కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. ఏటా దాదాపు లక్ష మందికి పైగా ఇక్కడ భిక్షను స్వీకరిస్తున్నారు.



నాగలూటి క్షేత్రంలో రాత్రి కొనసాగుతున్న అన్నదానం

భ్రమరాంబామల్లికార్జున స్వామి వార్ల ఆశీస్సులే



నాగలూటి వీరభద్రస్వామి క్షేత్రం వద్ద మా నాన్న బాల వెంకటరెడ్డి అన్నదానం చేసేవారు. నాన్న స్వర్గస్తులైన తర్వాత ఆయన అడుగుజాడల్లో నడుస్తూ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా నాగలూటి క్షేత్రం వద్ద అన్నదానం నిర్వహిస్తున్నాను. ఈ కార్యక్రమాన్ని దేవుడిచ్చిన వరంగా భావిస్తున్నా. నాన్న అడుగు జాడల్లో నడుస్తూ భిక్ష ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉంది. భ్రమరాంబామల్లికార్జునస్వామివార్లు ఇచ్చినఆశీస్సులని భావిస్తున్నాను.

– విష్ణువర్ధన్‌రెడ్డి, పెద్దదేవులాపురం

జిల్లా హద్దులు దాటిన సేవ

మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా పెచ్చెర్వు ఫారెస్ట్ క్యాంపు వద్ద అనంతపురం జిల్లాకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త వెంకటనారపురెడ్డి సేవ జిల్లా హద్దులు దాటింది. ఆయన ఆధ్వర్యంలో శివారెడ్డి, నరసింహారెడ్డి, చంద్రశేఖర్, నరేష్, లక్ష్మీకాంతరెడ్డి, గాయత్రి మిల్క్ నిత్యానందరెడ్డి, ఇస్కాన్ టెంపుల్ సహకారంతో ఐదేళ్లుగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఏటా వీరి ఆధ్వర్యంలో 3 లక్షల మందికి పైగా భక్తులకు అన్నదానం చేయడంతోపాటు ప్రస్తుత జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వీరు అన్నదాన కార్యక్రమంతోపాటు 24 గంటల వైద్యశిబిరాన్ని కూడా ఏర్పాటు చేశారు. శ్రీశైలం క్షేత్రానికి వచ్చే భ్రమరాంబ మల్లికార్జునస్వామికి లక్షలాది మంది భక్తులకు ఆకలి తీర్చడమేగాకుండా మినరల్ వాటర్ కూడా అందిస్తున్నారు. వీరితో పాటు పెచ్చెర్వు వద్ద గూడూరుకు చెందిన వీరభద్రస్వామి దేవస్థాన అన్నదాన కమిటీ నిర్వాహకులు 26 ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. దాదాపు 2 లక్షల మంది భక్తులకు అన్నదానం చేస్తున్నారు.



పెచ్చెరువులో భోజనం వడ్డిస్తున్న నిర్వాహకులు

ఐదేళ్లుగా అన్నదానం చేస్తున్నాం



శ్రీశైలం క్షేత్రానికి వచ్చే భక్తులకు దట్టమైన నల్లమల అభయారణ్యంలో అన్నదానం నిర్వహిస్తే బాగుంటుందని ఐదేళ్ల క్రితం మదిలో ఆలోచన వచ్చింది. అప్పటి నుంచి కాలినడకన వెళ్లే శివస్వాములు, భక్తులకు అన్నదానం చేస్తున్నాం. వారం రోజులపాటు శివస్వాములకు భోజన సౌకర్యంతో పాటు ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహిస్తూ, 24 గంటలు ముగ్గురు డాక్టర్లు, ఎనిమిది మంది సిబ్బందితో అన్ని మందులతో పాటు అత్యవసర వేళ శివస్వాములకు ఉపయోగపడేలా అంబులెన్స్‌ను కూడా నంద్యాల జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇక్కడ ఉంచాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవ అందిస్తున్నందుకు సంతోషంగా ఉంది.

– వెంకటనారపురెడ్డి, అనంతపురం జిల్లా

వెంకటాపురం వద్ద 27 ఏళ్లుగా..



కొందరు భక్తులు దూర ప్రాంతాల నుంచి వాహనాల్లో వెంకటాపురం చేరుకుని అక్కడి నుంచి పాద యాత్రగా శ్రీశైలం చేరుకుంటున్నారు. ఈక్రమంలో ఇక్కడ వెంకటాపురం గ్రామంలోని మల్లేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో 27 ఏళ్ల నుంచి శివభక్తులకు, శివస్వాములకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నారు. దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో నిరంతరం అన్నదానం నిర్వహిస్తూ శివస్వాములు, భక్తుల మన్ననలు పొందుతున్నారు.

మరికొన్ని చోట్ల..

కైలాసద్వారం వద్ద పత్తికొండకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు మురళీధర్‌రెడ్డి అన్నదాన కార్యక్రమాన్ని 24 ఏళ్ల నుంచి కొనసాగిస్తున్నారు. కాలినడకన కైలాసద్వారం చేరుకున్న భక్తులు ఇక్కడ భిక్ష స్వీకరించి శ్రీశైలమహాక్షేత్రానికి తరలివెళ్తున్నారు. అలాగే నల్లమల అటవీమార్గం నుంచి హఠకేశ్వరం వద్ద, ఆత్మకూరు మండలం కరివేన, రాధాపురం, అమలాపురం, వెలుగోడు, పాములపాడు, జూపాడుబంగ్లా, నందికొట్కూరు, వెంకాయపల్లె ఎల్లమ్మ, కర్నూలు సమీపంలోని పలు చోట్ల అన్నదాన కార్యక్రమాలు భక్తులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి.

శివప్రసాదంగా భావిస్తున్నాం



ఐదేళ్లుగా శ్రీశైలమహాక్షేత్రానికి కాలినడకన వెళ్తున్నాను. ఈసారి 4 రోజుల క్రితం కాలినడకన అయిజ నుంచి బయలుదేరి అలంపూర్ మీదుగా నందికొట్కూరు, ఆత్మకూరు, కరివేన అన్నదాన శిబిరాల్లో భిక్ష స్వీకరించి అది శివప్రసాదంగా భావిస్తున్నాను. ముందున్న నాగలూటిలో భిక్ష చేస్తాను. ఈ కొండ కోనల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం గొప్ప విషయం. నిర్వాహకులకు నిండు మనస్సుతో కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

– రాము, అరవీడు గ్రామం, అయిజ మండలం, తెలంగాణ రాష్ట్రం

ఆకలి తీర్చుతున్నారు



మూడేళ్లుగా శివ మాల ధారణ చేసి శ్రీశైలానికి వెళ్తున్నాను. కాలినడకన వస్తున్న మాలాంటి శివస్వాములందరికీ ఉచిత భోజన శిబిరాలు ఎంతగానో ఊరటనిస్తున్నాయి. వ్యయప్రయాసలతో వచ్చే శివభక్తులకు ఆకలిని తీరుస్తూ రక్షణ శిబిరాలుగా మారాయి.

– తోట మోహన్, ఉండబండ గ్రామం, విడపనకల్ మండలం, అనంతపురం జిల్లా

ఎనిమిదేళ్లుగా భిక్ష చేస్తున్నాను



ఎనిమిదేళ్లుగా మాలధారణ చేస్తూ శ్రీశైలక్షేత్రానికి వెళ్తున్నా. శివస్వాములకు ఎలాంటి ఇబ్బంది లేకుండా భిక్ష చేస్తూ ముందుకు సాగుతున్నాం. సుధూర ప్రాంతాల నుంచి కాలినడకతో నడవలేక ఇబ్బందిపడే సమయంలో ఈ శిబిరాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. భక్తులు నిదానంగా కాలినడకన శ్రీశైలక్షేత్రానికి చేరుకునేందుకు ఎంతగానో అన్నదాన కార్యక్రమాలు ఉపయోగపడుతున్నాయి. ఈ శిబిరాలు దేవుడిచ్చిన వరం.

– వేణుగోపాల్, మర్తాడు గ్రామం, గార్లదిన్నె మండలం, అనంతపురం జిల్లా

మల్లన్నకు పట్టు వస్త్రాలు



మల్లన్నకు పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న దేవస్థానం ఈఓ

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం వెంకటేశ్వరస్వామివారి దేవస్థానం, ద్వారకా తిరుమల వారు శ్రీశైల భ్రమరాంబా సమేత మల్లికార్జున స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు. ద్వారక తిరుమల దేవస్థాన ఈఓ కె.సత్యనారాయణమూర్తి, ఏఈఓ పి.నటరాజరావు, అర్చకులు భాను, వేదపండితులు సోమశేఖరశర్మ, వెంకటేశ్వరశర్మ పట్టువస్త్రాలతో శ్రీశైల ఆలయం వద్దకు రాగా ఆలయ రాజగోపురం వద్ద శ్రీశైల దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం పట్టువస్త్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి, మేళతాళాలతో సంప్రదాయబద్ధంగా స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు.

పోషకాహారంతో కంటి చూపు మెరుగు

పాములపాడు: పోషకాహార విలువలతో కూడిన ఆకుకూరలను ఆహార పదార్థాలుగా తీసుకోవడం వల్ల కంటి చూపు మెరుగవుతుందని ప్రధానోపాధ్యాయుడు క్రిష్ణమూర్తి అన్నారు. గురువారం మండలంలోని వేంపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కంటి వైద్యుడు షేక్షావలి మాట్లాడుతూ జాతీయ అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో పీడీ నాగరాజు, హెల్త్ అసిస్టెంట్ రమణమ్మ పాల్గొన్నారు.

సారా విక్రయిస్తే కేసులు నమోదు



సారాను చూపుతున్న ఎక్సైజ్ శాఖ ఎస్‌ఐ జఫ్రుల్లా, పోలీసులు

నందికొట్కూరు: నాటు సారా విక్రయిస్తే కేసులు నమోదు చేయడం ఖాయమని ఎక్సైజ్ శాఖ ఎస్‌ఐ ఎస్‌ఎండీ జఫ్రుల్లా హెచ్చరించారు. గురువారం నీలిషికారిపేటలో ఎక్సైజ్ అధికారులు సోదాలు నిర్వహించారు. నాటుసారా విక్రయిస్తున్న నీలిషికారి ప్రసాద్‌ను అరెస్టు చేసి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ప్రసాద్‌ను కోర్టులో హాజరుపరచగా 15 రోజులు రిమాండ్ ఆదేశించినట్లు ఎస్‌ఐ తెలిపారు. సోదాల్లో హెడ్ కానిస్టేబుళ్లు కుమారి, శంకర్ నాయక్ ఉన్నారు.

భవనాశి నదిపై వంతెన నిర్మాణం చేపట్టాలి



నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు, ప్రజా సంఘాల నాయకులు

పాములపాడు: మండలంలోని ఇస్కాల గ్రామ సమీపంలో భవనాశి నదిపై వంతెన నిర్మాణం చేపట్టాలని మాల మహనాడు మండల అధ్యక్షుడు మేకల జాన్‌బాబు అన్నారు. గురువారం గ్రామస్తులు, ప్రజా సంఘాల నాయకులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్కాల గ్రామానికి వెళ్లే దారిలో ఉంటే ఈ నది పక్కనే శ్రీశైలానికి ప్రథమ ముఖ ద్వారమైన నందీశ్వరాలయం ఉందన్నారు. ఈ ప్రాంతంలో వంతెన నిర్మాణం చేపట్టాలని ఏళ్లుగా కోరుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారన్నారు. ప్రస్తుతం శ్రీశైలం వెళ్లే పాదయాత్రికులు ఇక్కడ స్వామి వారిని దర్శనం చేసుకుంటారన్నారు. నదిలో కొద్దిపాటి నీళ్లు ఉండటం, రాళ్లు మొనదేలి ఉండటంతో కాళ్లు కోసుకుంటున్నాయని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం వంతెన నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు అంకన్న, సాయిక్రిష్ణ, నవీన్, చంద్రబాబు, స్వాములు, గోపాలక్రిష్ణ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఎల్‌ఐసీలో నూతన నియామకాలు చేపట్టాలి



ఒక గంట సమ్మెలో పాల్గొన్న ఎల్‌ఐసీ ఉద్యోగ సంఘం నాయకులు

ఆత్మకూరు: ఎల్‌ఐసీలో నూతన నియామకాలు చేపట్టాలని ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం ఆత్మకూరు బ్రాంచ్ కార్యదర్శి మనోజ్ కేపీ డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట సిబ్బందితో కలిసి గంట పాటు సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌ఐసీలో ఏడేళ్లలో 15 వేల మంది ఉద్యోగులు తగ్గారని, సంస్థ కోసం పాలసీదారుల కోసం తక్షణమే నూతన నియామకాలు చేపట్టాలన్నారు. హైటెక్ పరిజ్ఞానం ఉన్న యువత నూతన ఉద్యోగులను నియమించాల్సిన అవసరం ఎల్‌ఐసీకి ఉందన్నారు. జవాబుదారీతనం లేని ఔట్‌సోర్సింగ్ స్థానంలో సాధారణ నియామకాలే పరిష్కారమన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నాగన్న, జబీవుల్లాహ రవి, శోభారాణి, ప్రవీణ్, చంద్రశేఖర్, అమీర్, సౌభాగ్యవతి, ఉమాదేవి, సుచిత్ర, ఇస్మాయిల్, సీఐటీయూ నాయకులు యేసురత్నం, రణధీర్, రామ్‌నాయక్, వీరన్న పాల్గొన్నారు.

వీఆర్‌ఓకు పదోన్నతి

బండిఆత్మకూరు: మండల పరిధిలోని ఏ.కోడూరు వీఆర్‌ఓ ఆదిశేషయ్య సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది రుద్రవరం రెవెన్యూ కార్యాలయానికి బదిలీ అయ్యారు. అలాగే నందికొట్కూర్ వీఆర్‌ఓ నరసింహులు సీనియర్ అసిస్టెంట్‌గా బండిఆత్మకూరు రెవెన్యూ కార్యాలయానికి పదోన్నతిపై బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

మహానందీశ్వరుడిని దర్శించుకున్న కేంద్ర బృందం



దర్శనార్థం వచ్చిన కేంద్ర బృందం

మహానంది: న్యూఢిల్లీకి చెందిన కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ బృందం సభ్యులు రాజేష్ కుమార్, మామ్‌చంద్ గురువారం మహానందీశ్వరుడిని దర్శించుకున్నారు. అంతకుముందు మహానంది మండలంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను వారు తనిఖీ చేశారు. వారి వెంట పంచాయతీరాజ్ ఏఈ రాజశేఖర్‌రెడ్డి, ఏపీఓ మనోహర్ ఉన్నారు.

వాడీవేడిగా మండల సమావేశం

వెలుగోడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ లాలం రమేష్ అధ్యక్షతన గురువారం మండల సర్వసభ్య సమావేశం వాడీవేడిగా జరిగింది. తమకు గౌరవ వేతనం చెల్లించాలని ఎంపీటీసీ సభ్యులు కోరారు. పలుకుబడి ఉన్న రైతులకు తప్ప సామాన్య రైతులకు యూరియా దొరకడం లేదని వైస్ ఎంపీపీ శంకర్ నాయక్ సభ దృష్టికి తీసుకురాగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న రైతులకు ఆరు బస్తాల కంటే ఎక్కువ ఇవ్వడం లేదని వ్యవసాయ అధికారి పవన్ కుమార్ సమాధానం ఇచ్చారు. సమావేశంలో తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్, ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి, పశు వైద్యాధికారి కిషోర్‌కుమార్ రెడ్డి, ఏఈ రవీంద్ర నాయక్, సర్పంచ్ జయపాల్, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నసీరుద్దీన్ పాల్గొన్నారు.

ఫొటోలు తీసి.. మార్ఫింగ్ చేసి

- మార్ఫింగ్ వీడియోలను పోర్న్ సైట్‌లో పెట్టిన యువకుడు
- టెలిగ్రామ్‌లో వీడియోలు పెట్టి డబ్బులు చేసుకున్న మరో యువకుడు

శ్రీకాకుళం క్రైమ్ : విద్యార్థినితో చనువు పెంచుకున్న ఓ యువకుడు ఆమె ఫొటోలు, వీడియోలను మార్ఫింగ్ చేసి ఏకంగా పోర్న్ వెబ్‌సైట్‌లో పెట్టిన అక్రమార్కుడిని పోలీసులు పసిగట్టారు. మరొక యువకుడు ఇలాగే మార్ఫింగ్ వీడియోలను టెలిగ్రామ్‌లో షేర్ చేసి సొమ్ము చేసుకుంటున్న వైనాన్ని కూడా పోలీసులు గుర్తించారు. విద్యార్థిని ఈ నెల 11న రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు విచారణలో అనేక విషయాలు బయటకు వచ్చాయి. సీఐ పి.ఈశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం..

విద్యార్థినికి తెలియకుండానే..

చిత్తూరు జిల్లా తిరుపతికి చెందిన షేక్ మహ్మద్ సోయెల్ ఓ విద్యార్థినితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయాన్ని ఆసరాగా చేసుకుని విద్యార్థినితో చనువుగా ఉంటూ ఆమెకు తెలియకుండానే ఆమె చిత్రాలను, వీడియోలను తీసేవాడు. కొన్నాళ్లకు ఆమె వీడియోలను, ఫొటోలను న్యూడ్‌గా మార్ఫింగ్ చేశాడు. తెలియని నంబర్ నుంచి ఆమె వాట్సాప్‌కు ఫొటోలను, వీడియోలను పంపుతూ లైంగికంగా వేధించడం మొదలుపెట్టడమే కాక అంగీకరించాలని కోరేవాడు.

ధైర్యంగా ఫిర్యాదు చేసి..

ఇలా ఎవరు చేస్తున్నారో తెలియని విద్యార్థిని మొదట్లో తీవ్ర వేదన అనుభవించింది. తల్లిదండ్రులకు, పోలీసులకు చెబితే పరువు పోతుందని మొదట్లో భావించింది. కానీ ధైర్యం చేసి ఈ నెల 11న రెండో పట్టణ పోలీసులకు ధైర్యంగా ఫిర్యాదు చేసింది. సీఐ ఈశ్వరరావు విచారణ ఆరంభించి ఎవరైనా పరిచయస్తుల పనే అని భావించి తిరుపతికి చెందిన షేక్ మహ్మద్ సోయెల్ అని తెలుసుకుని నాలుగు రోజుల కిందట తిరుపతిలో ఉంటున్న అతనికి నోటీసులు పంపారు.

మరో దొంగ..

సోయల్‌ను విచారించడం, ఆయన ఫోన్‌ను క్షుణ్ణంగా పరిశీలించడంతో విద్యార్థిని ఫొటోలు, వీడియోలు వెబ్‌పోర్న్ సైట్‌లో అప్‌లోడ్ చేయడం చూశారు. అవే చిత్రాలు, వీడియోలు ఇన్‌స్టాగామ్, టెలిగ్రామ్‌ల్లో సైతం ఎలా అప్‌లోడ్ అయ్యాయన్నది అర్థం కాక జిల్లా సైబర్‌సైల్ బృందాన్ని రంగంలోకి దింపారు. వారు ఇన్‌స్టా, టెలిగ్రామ్ యాజమాన్యాలకు మెయిల్‌లో ఫిర్యాదు పంపగా అటునుంచి వారు ఐడీలు, ఫోన్ నంబర్ పంపించారు. అవి కర్నూలు జిల్లా నందికొట్కూరుకు చెందిన ఉప్పుగళ్ల రఘువిగా గుర్తించి అతనికి నోటీసులు పంపారు. గురువారం రఘు స్టేషన్‌కు రాగా విచారించారు.

ఒప్పుకున్నాడు..

పోర్న్‌సైట్‌లో వచ్చిన వీడియోలను అప్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టా, టెలిగ్రామ్‌లలో పెట్టింది తానేనని తనకు చాలా మంది ఫాలోవర్లు ఉండటంతో వారందరికీ తన ఐఆర్‌కోడ్‌ని లింక్ చేస్తే అమ్మాయిల వీడియోలు వస్తాయని, ఒకసారి లింక్ చేసేముందు తనకు రూ. 200లు పంపించాలని చెప్పడంతో చాలామంది తనకు డబ్బు పంపారని చెప్పారు. విస్తుపోయే నిజాలు తెలియడంతో సీఐ ఈశ్వరరావు గురువారం రాత్రి ఇరువురినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

బయోగ్యాస్ ప్లాంట్‌కు స్థల సేకరణపై ఆరా



రీసర్వేను పరిశీలిస్తున్న జేసీ విష్ణు చరణ్

వెలుగోడు: మండలంలో బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల సేకరణపై జేసీ విష్ణు చరణ్ రెవెన్యూ అధికారులను ఆరా తీశారు. గురువారం ఆయన వేల్పనూరు గ్రామ పరిధిలో జరుగుతున్న భూ రీ సర్వేను పరిశీలించారు. అనంతరం వెలుగోడులోని జగనన్న కాలనీని సందర్శించి, ఇంటి నిర్మాణాలను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిధులతో ఎంతో చక్కగా నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులతో మాట్లాడారు. బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించాలని ఆర్డీఓ నాగజ్యోతి, తహసీల్దార్ శ్రీనివాసగౌడ్‌కు సూచించారు. ఆయన వెంట టీడీ చంద్రశేఖర్, సర్వేయర్ ఉపేంద్ర, సీనియర్ అసిస్టెంట్ వెంకట్రామిరెడ్డి, వీఆర్వో జగదీష్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తనివ్వొద్దు

కొత్తపల్లి: వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అధికారులకు సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ కుసుమలత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో ముందుగా అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. అనంతరం పలువురు సభ్యులు సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ మేరి, తహసీల్దార్ ఉమారాణి, వైద్యాధికారి విజయేంద్ర, ఏపీఎం పుల్లయ్య, ఏఓ మహేష్ పాల్గొన్నారు.

సులభ పద్ధతిలో బోధించాలి

మిడుతూరు: సులభమైన పద్ధతిలో విద్యను బోధించాలని సీడీపీఓ కోటేశ్వరమ్మ, ఎంఈఓ శ్రీనాథ్ అన్నారు. గురువారం స్థానిక ఆదర్శ పాఠశాలలో జ్ఞానజ్యోతి కార్యక్రమం ద్వారా అంగన్‌వాడీ వర్కర్లకు రెండో రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటపాటలు, అభినయ గేయాలతో వారికి సులభశైలిలో బోధన సాగించాలనే ఉద్దేశంతో మూడు, నాలుగు, ఐదు ఏళ్ల వయస్సు పిల్లలకు జ్ఞానజ్యోతి కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందన్నారు.